క్లుప్తంగా...

నేడు కీసరగుట్టలో మహా చండీయాగం

కీసర: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కీసరగుట్టలో శుక్రవారం మహాచండీ హోమం నిర్వహించనున్నట్లు టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన కీసరలో మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇచ్చినందుకు కృతజ్ఞతతో పాటు దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుతూ కీసరగుట్టలో చండీ హోమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు నిర్వహించే హోమంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నేతలంగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు కీసర అమరవీరుల స్మారకచిహ్నం వద్ద శ్రద్ధాంజలి

జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం నుంచి 22 వరకు ఇరవై ఒక్క రోజులు వైభవంగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేసి, అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌ను రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఈ నెల 2న ఉదయం 8.20 గంటలకు కీసర చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం వద్ద అమరవీరులకు మంత్రి మల్లారెడ్డి శ్రద్ధాంజలి ఘటిస్తారని తెలిపారు. అనంతరం తూముకుంట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ ప్రాంగణం ఆవరణలో ఉదయం 9 గంటలకు మంత్రి మల్లారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, దశాబ్ది ఉత్సవ సందేశం, అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

కీసర: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుర్వీశ్రీనివాస్, వైద్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కొమ్మరాజుల వెంకటేష్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ సంతోష్‌నగర్ కాలనీలో నివసించే నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మీ ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న సామాజికవేత్త కొమ్మరాజుల వెంకటేష్ గురువారం ఆమె కుటుంబసభ్యులకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రతిఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సోను, కిషన్, ప్రవీణ్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి చేతుల మీదుగా జెండావిష్కరణ

మేడ్చల్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో మంత్రి మల్లారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి తెలిపారు. పట్టణ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజలు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

దశాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం

కీసర: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఈ మేరకు ఆమె మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 2 నుంచి 21వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను గ్రామాల్లో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయం వద్ద తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండావిష్కరణ చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలకరించారు.

దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

మేడ్చల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు. 20 రోజుల పాటు ఇచ్చిన ప్రణాళికలో భాగంగా మండల అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఉత్సవాలను మండలంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.





విద్యుత్ వెలుగులో మెరిసిపోతున్న మేడ్చల్ జిల్లా కలెక్టరేట్

దశాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని, ఈ నెల 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 21 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు పక్కా ప్రణాళికతో రూపొందించి విజయవంతమయ్యేలా అన్ని శాఖలకు దిశానిర్దేశం చేసినట్లు జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. జిల్లా ప్రత్యేక అధికారిగా బోయి విజయేందిరను ప్రభుత్వం నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఉత్సవాలకు సంబంధించి జిల్లాలోని ఐదుగురు నియోజకవర్గాలకు జిల్లాస్థాయి అధికారులను ఐదుగురిని ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. మండలాలకు కూడా ప్రత్యేక అధికారులను నియమించి ప్రభుత్వం సూచించిన మేరకు కార్యక్రమాలు ప్రారంభం నుంచి చివరి రోజు వరకు విజయవంతం అయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా..

ఈ సందర్భంగా జిల్లాస్థాయి కమిటీలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి వ్యవహరించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేకాధికారులుగా మేడ్చల్ నియోజకవర్గానికి కీసర ఆర్డీవో రవి, మల్కాజిగిరి నియోజకవర్గానికి మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ జీ.రాజు, కూకట్‌పల్లి నియోజకవర్గానికి మూసాపేట డిప్యూటీ కమిషనర్ రవికుమార్, ఉప్పల్ నియోజకవర్గానికి ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి డిప్యూటీ కమిషనర్ మంగతాయారు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించనున్నారని కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. మండలాలకు మండలస్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించి పూర్తి బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. ప్రతిరోజూ జరిగే కార్యక్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకాధికారులు చూస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు.

మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు..

దశాబ్ది ఉత్సవాల్లో మొదటి రోజైన శుక్రవారం జాతీయ పతాకావిష్కరణతో మొదలుకొని ఈనెల 3న రైతు దినోత్సవం, 4వ తేదీన పోలీసుల ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవం , 5వ తేదీన విద్యుత్తు విజయోత్సవం, 6వ తేదీన పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. 7వ తేదీన సాగునీటి దినోత్సవాన్ని, 8వ తేదీన ఊరూరా చెరువుల పండగ, 9వ తేదీన సంక్షేమ సంబురాల నిర్వహణ, 10వ తేదీన సుపరిపాలన దినోత్సవం, 11వ తేదీన సాహిత్య దినోత్సవం నిర్వహణ, 12వ తేదీన తెలంగాణ రన్ కార్యక్రమం నిర్వహణ, 13వ తేదీన మహిళా సంక్షేమ దినోత్సవం, 14వ తేదీన వైద్య, ఆరోగ్య దినోత్సవం, 15వ తేదీన పల్లె ప్రగతి దినోత్సవం, 16వ తేదీన పట్టణ ప్రగతి దినోత్సవం, 17వ తేదీన తెలంగాణ గిరిజనోత్సవం, 18వ తేదీన మంచినీళ్ల పండగ, 19వ తేదీన హరితోత్సవం, 20వ తేదీన విద్యా దినోత్సవం, 21వ తేదీన ఆధ్యాత్మిక దినోత్సవం కార్యక్రమాలు ఉంటాయన్నారు. 22వ తేదీన అమరవీరుల సంస్మరణతో ఉత్సవాలు ముగుస్తాయని కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు.

సమన్వయం చేసుకుంటూ..

ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాల వివరాలను పట్టణాల్లోనే కాకుండా గ్రామాలు, తండాలు, వాడవాడలా జరిగేలా అధికారులకు అవసరమైన సూచనలు చేశామని ఆయన తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలు, గ్రామస్తులతో అధికారులు సహపంక్తి భోజనాలు చేయాల్సి ఉంటుందన్నారు.

జిల్లాస్థాయి నుంచి మొదలుకొని గ్రామస్థాయి వరకు ప్రతి అధికారి సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు, మేయర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రతి ఒక్కరూ అందరితో కలిసి సంబురాలను విజయవంతం చేయాలని కలెక్టర్ అమయ్ కుమార్ ఆకాంక్షించారు.

అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి

జవహర్‌నగర్: అభాగ్యులకు అండగా ఆర్థిక భరోసాగా సీఎం సహాయనిధి నిలిచిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ బీజేఆర్‌నగర్‌కు చెందిన యాదమ్మ మెదడులోని నరాల సమస్యతో బాధపడుతోందని, వైద్యఖర్చుల నిమిత్తం కార్పొరేటర్ మెట్టు ఆశా కుమారిని సంప్రదించగా ఆమె వెంటనే మంత్రి మల్లారెడ్డి దృష్టికి తీసుకొచ్చింది. యాదమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌వోసీని గురువారం మంత్రి మల్లారెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, 7వ డివిజన్ అధ్యక్షుడు మెట్టు వెంకన్న, నాయకులు బండకింది ప్రసాద్, బాలరాజు, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి ఎల్‌వోసీని అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

సమన్వయంతో విజయవంతం చేద్దాం

కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగే వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను మేడ్చల్ – జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా పాటించాల్సిన ప్రొటోకాల్, స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన అలంకరణ, మంత్రితో పాటు కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కూర్చునే సభావేదిక వద్ద ఏర్పాట్లు, అవార్డులు తదితర వాటిని క్షుణ్ణంగా ఆయన పరిశీలించి సంబంధింత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మంత్రి మల్లారెడ్డి ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకొని జాతీయ పతాకావిష్కరణ మొదలుకొని తిరిగి వెళ్లే వరకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వేడుకలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో ఉంటూ వారికి కేటాయించిన విధులను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసమూర్తి, ఏసీపీ రామలింగరాజు, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్రావు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



ఘట్‌కేసర్: చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి గాంధీ ఆస్పత్రిలో మరణించిన ఘటన ఆలస్యంగా తెలిసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవుషాపూర్ గ్రామంలో గతనెల 26న ఉదయం 9 గంటలకు ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో గాయలైన ఆ వ్యక్తిని చికిత్స కోసం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మరణించాడు. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహం గాంధీ ఆస్పత్రిలో ఉంది. బంధువులు ఎవరైనా ఉంటే.. ఫోన్: 87125 80118.

ఇళ్లపై ఉన్న కరెంట్ తీగలను తొలగించాలి

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న కరెంట్ తీగలను తొలగించాలని గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో చాలా ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు, కొన్ని ప్రాంతాల్లో హైటెన్షన్ కరెంట్ తీగలను తొలగించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఉపసర్పంచ్ పెంటమ్మ, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాజు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సదానంద్‌గౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఐఐఐటీకి ఎంపికైన కేపీఆర్ఐటీ విద్యార్థులు



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఈశ్వర్

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(కేపీఆర్ఐటీ)కి చెందిన ధీరజ్‌కుమార్, అనంత అభిజిత్ ప్రఖ్యాత ఐఐఐటీకి ఎంపియ్యారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో చైర్మన్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఈశ్వర్ అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేపీఆర్ఐటీ విద్యార్థుకు ఐఐఐటీలో ప్రవేశం లభించడం గర్వంగా ఉందని, కళాశాలలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతోనే ఇద్దరు విద్యార్థులకు ఐఐఐటీలో ప్రవేశం లభించిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ రిలేషన్ డైరెక్టర్ కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులోని ఓల్డ్ విలేజ్‌లో సుమారు రూ.4 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను కౌన్సిలర్ పంగ హరిబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ వార్డులోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.